క్లుప్తంగా

కోడి పందెంరాయుళ్లు అరెస్ట్

కమలాపురం : మండలంలోని గంగవరం గ్రామ సమీపంలోని పెన్నా నది పరివాహక ప్రాంతంలో శుక్రవారం కోడి పందాలు ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. కోడి పందాలు ఆడుతున్న సమాచారం రావడంతో సీఐ ఎస్కే రోషన్ పర్యవేక్షణలో ఎస్ఐ తన సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. కోడి పందాలు ఆడుతున్న 11 మందిని పట్టుకుని అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి 5 పందెం కోడి పుంజులను, రూ.20,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. 11 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు. ఏఎస్ఐ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలి



పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న పులివెందుల డీఎస్పీ మురళి, సీఐ రమణలు

సింహాద్రిపురం : వాహనదారులు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ రవికుమార్ సూచించారు. శుక్రవారం గురిజాల రోడ్డు, వైఎస్సార్ సర్కిల్ ప్రాంతాలలో ఆయన పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించి సరైన పత్రాలులేని వాహనాలను, లైసెన్స్‌లేని వారిని గుర్తించి జరిమానాలు విధించారు. అలాగే సింహాద్రిపురం ప్రధాన కూడళ్లలో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వాటిని శుక్రవారం రాత్రి పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, రూరల్ సీఐ డీవీ రమణలు ప్రారంభించారు.

ఆధార్ సర్వీసు కేంద్రం ఏర్పాటు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల పట్టణంలోని మూడవ సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆధార్‌లో మార్పులు చేర్పులను చేసుకోవటానికి ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఈ కేంద్రాన్ని శాశ్వితంగా ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు. నల్లపురెడ్డిపల్లె 33 కె.వి విద్యుత్‌లైన్ వర్క్ జరుగుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు ఉచిత కంటి పరీక్ష శిబిరం

చక్రాయపేట : మండలంలోని మారుమూల ప్రాంతమైన కల్లూరుపల్లె క్రాస్ వద్ద ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గొకనపేట గ్రామ సర్పంచ్ జి.రామాంజులరెడ్డి తెలిపారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కడపలో ఆపరేషన్‌లు కూడా ఉచితంగా చేస్తారన్నారు. ఉచితంగా భోజనవసతి, వాహన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సత్యసాయి జిల్లాలోని నంబులపూలకుంట, తలుపుల, గాండ్లపెంట, అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, వైఎస్ఆర్‌జిల్లాలోని చక్రాయపేట మండల వాసులకు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని కల్లూరుపల్లె క్రాస్ వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బక్రీద్ పండుగ సందర్భంగా కడపలో భారీ బందోబస్తు



బందోబస్తు వివరాలను తెలియజేస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్: కడప నగరంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శనివారం అన్ని ఈద్గాల వద్ద ప్రార్థనల నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలియజేశారు. ముగ్గురు సీఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీలు, కానిస్టేబుల్, ఇతర సిబ్బంది మొత్తం 120 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆవులు, ఒంటెలు రవాణాపై గట్టి నిఘా వుంచాలన్నారు. పికెటింగ్స్, చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

కమలాపురం : ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే పండుగలలో బక్రీద్ పండుగ ఒకటి. ఈ పండుగను త్యాగానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఈద్-ఉల్-జుహ అని కూడా ఈ పండుగను పిలుస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం చివరి నెల జిల్ హిజ్జ. ఈనెల 10వ రోజున బక్రీద్ పండును ముస్లింలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకుంటారు. అల్లాహ ఆజ్ఞను తుచా తప్పకుండా పాటించడమే ఈ పండుగ అర్థం.

కన్న కొడుకునే త్యజించడానికి సిద్ధ పడిన హజరత్ ఇబ్రహీం

హజరత్ ఇబ్రహీం ఖలీలుల్లా (స.హ.స) తన కన్న కొడుకు ఇస్మాయిల్ (స.హ.స.)ను త్యజించడానికి సిద్ధ పడ్డారు. హజరత్ ఇబ్రహీంకు తన 80వ ఏటా అల్లాహ సంతానాన్ని(హజరత్ ఇస్మాయిల్) ప్రసాదిస్తారు. ఇస్మాయిల్ స.హ.స. ఏడవ ఏట హజరత్ ఇబ్రహీం తన కుమారుడిని జుబాహ (గొంతు కోయడం) చేసినట్లు మూడు సార్లు కలలో చూస్తారు. దీన్ని అల్లాహ ఆజ్ఞగా భావించిన హజరత్ ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌కు చెబుతారు. ఈ విషయం విన్న ఇస్మాయిల్ ఆనందంగా తన గొంతు కోయమని చెబుతారు. దీంతో హజరత్ ఇబ్రహీం తన కుమారుడిని అల్లాహ్‌కు సమర్పించేందుకు సిద్ధ పడతారు. ఇస్మాయిల్ గొంతుపై ఇబ్రహీం పదునైన కత్తి ఉంచి గొంతు కోసేందుకు మూడు పర్యాయాలు ప్రయత్నిస్తారు. అయితే అల్లాహ మహిమతో గొంతు తెగదు. అదే సమయంలో అల్లాహ ఆజ్ఞతో ఆ ప్రాంతంలో పొట్టేలు సంతతికి చెందిన దుంబా అనే జంతువు ప్రత్యక్షం అవుతుంది. ఇస్మాయిల్‌కు బదులుగా ఆ దుంబాను జుబాహ చేయాలని, ఇది అల్లా ఆజ్ఞ అని అక్కడ ప్రత్యక్షమైన ఓ దేవదూత ఇబ్రహీంకు చెబుతారు. దీంతో ఇబ్రహీం దుంబాను జుబాహ చేసి అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెబుతారు. దీన్ని ×ఖుర్బాని₹ అని పిలుస్తారు. అప్పటి నుంచి అర్హత ఉన్న ప్రతి ముస్లిం పై ఖుర్బాని చేయడం విధిగా చేయడమైంది.

మూడు భాగాలు చేయాలి

52 తులాలు వెండి లేదా 7.5 తులాల బంగారు ఉన్న ప్రతి ముస్లిం విధిగా ఖుర్బాని చేయాలి. ఖుర్బాని చేసే జంతువును మూడు భాగాలు చేసి ఒక భాగం సొంతానికి, మరో భాగం పేదలకు, మూడో భాగం బంధువులకు పంచి పెట్టాలి. పంచే భాగం కనీసం ఒక మనిషి ఒక పూట తినే విధంగా ఉండాలి.

జీవితంలో కనీసం ఒకసారైనా హజ్ చేయాలి

ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో కనీసం ఒకసారైనా హజ్ తప్పని సరిగా చేయాలి. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో వెలసిన కాబాలో హజ్ చేయాలి. జిల్ హజ్ మాసంలో 9వ రోజు ఈ హజ్ జరుగుతుంది. ఆ రోజు ఉపవాసం ఉండి హజ్ చేస్తే చేసిన పాపాలన్ని తొలగిపోతాయని ముస్లింలు విశ్వసిస్తారు.



కమలాపురం ఈద్గా మైదానంలో షామియానాలు సిద్ధం చేసిన నిర్వాహకులు

ఏర్పాట్లు సిద్ధం

బక్రీద్ పండుగను సంతోషంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. స్థానిక ఈద్గా మైదానంలో ఈదు-ఉల్-జుహ ప్రత్యేక నమాజ్ ఉదయం 9 గంటలకు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈద్గా ఆవరణలో షామియానాలు వేసి నమాజ్ ఆచరించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అలాగే పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో కూడా ఈద్ నమాజ్ ఆచరించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అర్హత ఉండి కూడా హజ్ చేయకపోతే అవిశ్వాసిగా మరణిస్తారు



అర్హత ఉన్న ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో కనీసం ఒకసారి హజ్ చేయాలి. అర్హత, ఆరోగ్యం ఉండి కూడా హజ్ చేయక పోతే వారు అవిశ్వాసిగా మృతి చెందుతారు. ఖుర్బాని చేసే జంతువును మూడు భాగాలు చేసి ఒక భాగం పేదలకు పంచి పెట్టాలి.

–హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, పీఠాధిపతి, దర్గా–ఏ–గఫారియా, కమలాపురం

ఈద్గాలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం



ఈద్-ఉల్-జుహ పండుగ జరుపు కోవడానికి ఈద్గా మైదానంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. ఉదయం 9 గంటలకు నమాజ్ ప్రారంభం అవుతుంది. ముస్లింలు సాంప్రదాయ దుస్తులు ధరించి సమయానికి ఈద్గా చేరుకోవాలి.

–సయ్యద్ నాసీర్ హుసేనీ, ప్రభుత్వ ఖాజీ, కమలాపురం.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోవాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిషనర్, పశుసంవర్ధకశాఖ ఏడీ

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల పట్టణంలో బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి, పశుసంవర్ధకశాఖ ఏడీ మునయ్యలు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు చట్టం ప్రకారం ఆవులు, దూడలతోపాటు ఒంటేలను హింసంచకూడదని సూచించారు. ప్రతి ఒక్కరు చట్టం మేరకు మాత్రమే నడుచుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో వివిధ మటన్ దుకాణాల వద్ద పోస్టర్‌ల ద్వారా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మేనేజరు పుల్లయ్య, శానిటేషన్ అధికారి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : బక్రీద్ పర్వదినాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతితో కలిసి ఆయన మత పెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పండుగ రోజున ఆవులు, ఒంటెలు, తదితర జంతువులను బలిచేయరాదని బాధ్యతగా వ్యవహరించి పండుగను జరుపుకోవాలని సూచించారు.

విజిలెన్స్ తనిఖీలతో నెలకొన్న నీటి సమస్య

పులివెందుల టౌన్ : పట్టణంలోని వైఎస్ జయమ్మ కాలనీ, వాసవీ కాలనీలతోపాటు పట్టణంలోని పలు ప్రాంతాలలో వారం రోజులుగా నీటి సరఫరా కాకపోవడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు, మహిళలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాడా నిధులతో అభివృద్ధి పనులను చేపట్టారు. దీంతో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా ఆయా ప్రాంతాలలో కొత్త మోటార్లు, పైపులైన్లను ఏర్పాటు చేసి నీటిని సజావుగా అందించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం కక్ష సాధింపు ధోరణితో గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ ఎంక్వైరీ చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో పులివెందుల పట్టణంలోనే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పూర్తి నాణ్యతతో పారదర్శకంగా పనులను చేపట్టారు. అభివృద్ధి పనుల కోసం పాడా(పులివెందుల అథారటీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేసి అందుకు సంబంధించి ప్రత్యేక అధికారిని నియమించి పులివెందుల నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారని చెప్పవచ్చు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అప్పటి పనులపై ఎంక్వైర్వీ చేపట్టింది. అందులో భాగంగా విజిలెన్స్ అధికారుల తనిఖీలను చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో



పులివెందులలో తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

ఉన్న 14 మోటార్లను వెలికి తీసి పైపుల నాణ్యతను, మోటార్ల స్థితిగతులను పరిశీలిస్తున్నారు. అయితే అభివృద్ధి పనులలో ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తి నాణ్యతతో పారదర్శకంగా పనులు జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విజిలెన్స్ అధికారుల తనిఖీలవల్ల పులివెందుల ప్రాంత ప్రజలకు నీటి సమస్య నెలకొంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాముడును వివరణ కోరగా విజిలెన్స్ అధికారుల తనిఖీలలో భాగంగా రెండు, మూడు రోజులు మున్సిపాలిటీలో నీటి సమస్య ఏర్పడిన విషయం వాస్తవమేనని, ప్రస్తుతం ఆ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపాలిటీలో ఎక్కడా నీటి సమస్య ఉండదన్నారు.

పిల్ల కాలువలను వెంటనే పూర్తి చేయాలి

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని పిల్ల కాలువలను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధృవకుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పులివెందులలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృష్ణా జలాలను తెప్పించి పనులు వేగంగా చేయించారన్నారు. ప్రస్తుతం పులివెందల ప్రాంతానికి నీరు అందించే పైడిపాలెంలో 5 టీఎంసీల నీరు, సీబీఆర్‌లో 7 టీఎంసీల నీరు ఉందన్నారు. దీంతో ప్రధాన కాలువలు, వాగులు, వంకలు, చెరువులకు మాత్రమే కృష్ణా జలాలను అందిస్తున్నారన్నారు. పిల్ల కాలువలను పూర్తి చేయకపోవడంతో పొలాల రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పిల్ల కాలువలను పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వసతి గృహాలలో ఏసీఎం పిచికారి



ప్రభుత్వ హాస్టల్‌లో ఏసీఎం పిచికారి చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతిగృహం, మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఏసీఎం పిచికారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య మాట్లాడుతూ హాస్టళ్లలో దోమలను అరికట్టడానికి, విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు ముందస్తు చర్యలలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నివారణకు ఇది ఒక ముఖ్యమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సోమలింగారెడ్డి, వసతి గృహ సంక్షేమ అధికారి లక్ష్మీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రకటించిన ప్రతిభా అవార్డులకు వేంపల్లెకు చెందిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన జి.సాయినాథ్, పి.గురుభావన విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు జిల్లా అధికారులు ప్రకటించారన్నారు. ఎంపికైన ఇద్దరు విద్యార్థులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసా పత్రం, ట్యాబు అందుకుంటారన్నారు. ప్రతి ఏడాది వేంపల్లె శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభా అవార్డుకు ఎంపికవుతున్నారని, తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపిక కావడంపట్ల కరపాండెంట్ బి.చక్రపాణి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్స్ బి.చేతన్ రెడ్డి, బి.చైతన్య రెడ్డిలు విద్యార్థులను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

అలాగే 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఈ అవార్డులకు పాఠశాలకు చెందిన ఎస్.వినయ్, ఎన్.సుకీర్తనలు ఎంపికయ్యారని, రాష్ట్ర ప్రభుత్వం మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరిట ప్రతిభ అవార్డులను ప్రకటించారన్నారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు ఈనెల 9వ తేదీన సోమవారం ప్రముఖుల సమక్షంలో రూ.20వేల నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేస్తారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలకు సాధించడంపట్ల, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను కరస్పాండెంట్ ప్రశంసించారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతిభ అవార్డుకు వేంపల్లె ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు అ పాఠశాల కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రతిభ అవార్డుకు ఎంపికైన పూనేటి తేజేష్, పడమటింటి కేశవానంద్‌లను పాఠశాల కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి అభినందించారు. ఈనెల 9న కడప నగరంలో జరగనున్న అవార్డుల ప్రధానోత్సవంలో విద్యార్థులకు ప్రముఖులు అవార్డులను ప్రదానం చేస్తారన్నారు. పాఠశాల విద్యార్థులు సాధించిన విజయంపట్ల కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జగనన్న పథకాలకు చంద్రగ్రహణం

వల్లూరు (చెన్నూరు) : ఏడాది పాలనలో మేము ఇది చేశామని చెప్పుకునే పరిస్థితిలో కూటమి నేతలు లేరని వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రసాని నిరంజన్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి నాయకులు దోపిడి మాత్రం బాగా చేస్తున్నారని, ప్రభుత్వానికి రావాల్సిన రాబడి నాయకుల జేబుల్లోకి పోతుందన్నారు. ఇసుక, మట్టి, మద్యం ఆదాయం ప్రభుత్వం నుంచి రాజకీయ నాయకుల జేబులోకి పోతోందన్నారు. రెండు లక్షల యాభై వేలమంది వలంటీర్లకు, 25 వేల మంది మద్యం షాపుల సిబ్బందికి, 16వేలమంది ప్రభుత్వ రెగ్యులర్ షాపుల్లో పనిచేస్తున్న వారికి, 15వేలమంది విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే వారికి, 15 వేలమంది రేషన్ డోర్ డెలివరి సిబ్బందికి, 5 వేల మంది ఫైబర్ నెట్ సిబ్బందికి, 5 వేల మంది చెత్త సేకరణ బండ్ల సిబ్బందికి, 20 వేల ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి పోయిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు కడుపు కోత మిగిల్చారన్నారు. ఇదీ చంద్రబాబు నాయుడు ఏడాదికాలంగా చేస్తున్న పరిపాలనగా అభివర్ణించారు. మీరు ఇచ్చేది కేవలం డీఎస్సీ నోటిఫికేషన్ మాత్రమేనని, ఏడాది కాలం అవుతున్న కేవలం 16 వేల డీఎస్సీ మాత్రమే వదిలారు దానికి కూడా మెగా డీఎస్సీ అని పేరు పెట్టారన్నారు. మరి ఒక్క ఏడాది కాలంలో ఒకేసారి రెండున్నర లక్ష ఉద్యోగాలు ఇచ్చి దేశ చరిత్రలోనే ఒక చరిత్ర సృష్టించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలగిరి ఉమామహేశ్వర్‌రెడ్డి, మిట్టా కేశవరెడ్డి, గాజులపల్లె సాయినాథరెడ్డి, చింతకుంట సాయిరెడ్డి, ఎర్రసాని శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు

వేంపల్లె : పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని గ్రంథాలయ అధికారిణి వనజ కుమారి తెలిపారు. స్థానిక పాతపేటలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిశాయి. శుక్రవారం వివిధ రకాల ఆటల పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రిటైర్డు ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి వనజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్లు వాడడంవల్ల ఎన్నో అనర్థాలకు దారి తీస్తాయన్నారు. గ్రంథాలయంలో 40 రోజులపాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న రిటైర్డు ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి

గడ్డి వామి దగ్ధం



మంటలు అర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెండ్లిమర్రి : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడి వామి దగ్ధమైన ఘటన మండలంలోని నల్లయ్యగారిపల్లె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నల్లయ్యగారిపల్లె గ్రామానికి చెందిన రైతు శివరామిరెడ్డి పశువుల మేత కోసం ఇంటి సమీపంలో గడ్డి వామి ఏర్పాటు చేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చెరుకొని అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికై పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.1లక్ష నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

కల్యాణం.. కమనీయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురం సమీపంలో ఉన్న శ్రీకృష్ణాలయంలో శుక్రవారం రాత్రి శ్రీకృష్ణసమేత రుక్మిణీ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మనోజాచార్యులు కల్యాణ తంతును శాస్త్రోయుక్తంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, పచ్చని తోరణాల మధ్య రుక్మిణీ కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్పాలతో అలకరించారు. భక్తులకు కమిటీ సభ్యులు భోజనాన్ని అందించారు.



రుక్మిణీ కల్యాణ తంతును నిర్వహిస్తున్న అర్చకులు



తిలకిస్తున్న భక్తులు

వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా

వేంపల్లె : స్థానిక గండి రోడ్డు, పుల్లయ్య తోట తదితర ప్రాంతాలకు సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు చొరవతో వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేశారు. పాపాఘ్ని నది నుంచి ఆయా ప్రాంతాలకు పైపులైన్ ద్వారా మంచినీటి సరఫరా అవుతున్న క్రమంలో పైపులైను పగిలిపోవడంతో ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరా ఆగిపోయింది. ఆయా ప్రాంతాల ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి శుక్రవారం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధిలైట్లు, మంచినీటి తదితర సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

మహిళలకు నైట్ డ్యూటీల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పని గంటలు పెంచుతూ మహిళలతో నైట్ డ్యూటీలు చేయించాలని నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు అమలుకు రాష్ట్రానికి ఇచ్చే ఆదేశాలు అమలుపరిచే చర్యలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ దుర్మార్గమైన నిర్ణయాలు చేశారన్నారు.

తల్లికి వందనంపై అధికారిక తేదీ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడులో పాఠశాలలు తెరవక ముందే తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ ఇస్తామని ప్రస్తావన చేసి వారం రోజులు కావస్తున్నా ఇంతవరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు అధికారిక అప్డేట్ అందించకపోవడం చాలా బాధాకరం అని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కడప మహానాడులో తల్లికి వందనంపై ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై సంబంధిత విద్యాశాఖ అధికారులకు అధికారిక ముందస్తు అప్డేట్ అందజేసి డేటా సేకరించాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనంపై ముందస్తు డేట్ ఫిక్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

యోగాంధ్ర నమోదు ప్రక్రియ లక్ష్యాన్ని అధిగమించాలి

చక్రాయపేట : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ సంఘాల సభ్యుల నమోదు ప్రక్రియ లక్ష్యాన్ని అధిగ మించాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లెలో జరుగుతున్న యోగాంధ్ర నమోదు సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా చేయడం అలవరచు కోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యులకు రుణాలు మంజూరుకు ఏసీపీఎల్ కార్యక్రమంలో భాగంగా బయో మెట్రిక్ త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. రుణాలు అవసరమైన సంఘ సభ్యులచే దరఖాస్తు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్తేరు రాణి, సీసీలు, వీఓఏలు, అకౌంటెంట్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆమె గండి వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు.



ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

బదిలీ ఉత్తర్వులలో జరిగిన లోపాలను సరిచేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో టెక్నికల్ సమస్యల వల్ల తలెత్తినటువంటి తప్పిదాలను సరి చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు ఏబీ. రామకృష్ణంరాజు అన్నారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికోన్నత పాఠశాలలలో మహిళా ఉపాధ్యాయులు అప్లై చేసుకోనప్పుడు మాత్రమే 50 సంవత్సరాలు దాటిన పురుష ఉపాధ్యాయులను బదిలీ చేయవచ్చు అనే నిబంధనను తోసిపుచ్చారన్నారు. మహిళా ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ కూడా పురుష ఉపాధ్యాయులను నియమించారన్నారు. అదేవిధంగా జిల్లాలో బదిలీ ఉత్తర్వులలో జరిగిన తప్పిదాలు సవరించి ఉపాధ్యాయులు ఆందోళన చెందకుండా చూడాలని డీఈఓను కోరారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సోమశేఖర్ ,అన్నమయ్య జిల్లా పెనగలూరు మండల నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య భాగ్యం

కడప ఎడ్యుకేషన్: యోగ చేయడం ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్య భాగ్యం కలుగుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో యోగా అధ్యాపకుడు చంద్రమౌలి విద్యార్థులకు సూర్య నమస్కారాలను చేయించి యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు హబీబుల్లా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాజారావు, అధ్యాపకులు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.